క్లుప్తంగా

ఘనంగా బర్సీ మహోత్సవం

కమలాపురం : పట్టణంలో వెలసిన దర్గా–ఏ–గఫారియాలో శ్రీ హజరత్ దస్తగిరి షా ఖాద్రి బర్సీ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం దర్గా పీఠాధిపతి, సజ్జాదే నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో అశేష భక్త జన సందోహనం నడుమ బర్సీ మహోత్సవాన్ని నిర్వహించారు. పీఠాధిపతి ఇంటి నంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో గంధంను ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. ఊరేగింపు దర్గా చేరుకున్న అనంతరం భక్తులు పీఠాధిపతి ఆధ్వర్యంలో స్వామి వారి మజార్లపై పూల చాదర్ సమర్పించి, గంధం ఎక్కించారు. అనంతరం పీఠాధిపతి భక్తులందరికి గంధం పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంట నమోదు చేసిన పొలాల తనిఖీ

లింగాల : మండలంలోని దొండ్లవాగు గ్రామంలో బుధవారం ఏఓ రమేష్ గ్రామంలోని వేరుశనగ, మొక్క జొన్న పంటలను తనిఖీ చేసి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని, సాగులో ఉన్న ప్రతి పంట ఇ–క్రాప్ బుకింగ్‌లో నమోదు కావాలని సిబ్బందికి సూచించారు.

ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవరచుకోవాలి



పేద ప్రజలకు సరుకులు అందిస్తున్న సీఐ ఎస్కే రోషన్

కమలాపురం : ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవరచుకోవాలని సీఐ ఎస్కే రోషన్ తెలిపారు. బుధవారం దాతల సహకారంతో అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు సమకూర్చిన నిత్యావసర సరుకులను ఆయన పేద ప్రజలకు అందజేశారు. అనాథలను, అభాగ్యులను ఆదుకుంటున్న అభి ట్రస్ట్ చైర్మన్‌ను అభినందించారు. దాతలు ముందుకు వచ్చి ఇలా సేవా కార్యక్రమాలు చేస్తే పేద ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ముదిరాజ్ రాము, సచివాలయం–3 ఏఎన్ఎం రోజా తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ప్రిన్సిపాల్

వేంపల్లె : సమాజ శ్రేయస్సు పట్ల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు బాధ్యతగా పనిచేయాలని కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సేవా భావంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సమాజ సేవ ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేయడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఓబుల్ రెడ్డి, వైఆర్‌సీ కోఆర్డినేటర్ సుధాకర్, లైబ్రేరియన్ మాధవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి



ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, తదితరులు

వేంపల్లె : నవ భారత సమాజ పునర్నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. బుధవారం స్థానిక ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో సేవా భావాన్ని కలిగి ఉండాలని. దేశ సేవలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జి.దీప్తి, ప్రోగ్రాం అధికారులు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామసచివాలయ ఐక్య కార్యాచరణ కమిటీ ఎన్నిక

ముద్దనూరు : మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ ఎన్నికైoది. బుధవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దమస్తాన్, నియోజకవర్గ కన్వీనర్ రాజారెడ్డిల ఆధ్వర్యంలో మండల జేఏసీని ఎన్నుకుంది. ఈ జేఏసీ అధ్యక్షురాలిగా సౌభాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా శివారెడ్డి, కన్వీనర్‌గా భరత్‌కుమార్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా చిన్నయ్య, అదనపు సెక్రటరీగా శివలు ఎన్నికయ్యారు.

మీభూమి పోర్టల్ లాగిన్ ఓపెన్‌కాక కష్టాలు

- మొరాయిస్తున్న మీ భూమి పోర్టల్‌లో ఓపెన్ కానీ భూనక్ష
- వెబ్‌ల్యాండ్ సకాలంలో తెరుచుకోని భూముల వివరాలు
- ఇదే అదునుగా దోచేసుకుంటున్న మీ సేవ, ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులు



పనిచేయని మీభూమి పోర్టల్ వెబ్‌సైట్

సింహాద్రిపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించకపోగా కొత్త సమస్యలను సృష్టిస్తోంది. ఇన్నాళ్లు సాఫీగా సాగిన మీ భూమి, భూనక్ష పోర్టల్లో మార్పులు తీసుకొచ్చింది. రెండు నెలలుగా మీ భూమి పోర్టల్‌లో ఓటీపీ లాగిన్ ఏర్పాటు చేయడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు అధికమవుతున్నాయి. రైతులు, ప్రజలు తమ భూముల వివరాలను మీ భూమి పోర్టల్‌లో తెలుసుకోలేక అవస్థలు పడుతున్నారు. సింహాద్రిపురం మండలంలో 9,186 హెక్టార్ల వ్యవసాయ భూములు ఉన్నాయి.

మొరాయిస్తున్న మీ భూమి పోర్టల్

గ్రామాల్లో మీ భూమి పోర్టల్‌లో భూమి వివరాలు పొందేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలోని సమగ్ర భూముల వివరాలన్నీ మాయమయ్యాయి. ప్రస్తుతం చాలా వరకు భూముల వివరాలు కనిపించడంలేదు. ఇదే సమయంలో పోర్టల్ మొరాయిస్తోంది. నెట్ సెంటర్ల వద్ద రోజంతా పడిగాపులు కాస్తున్నా అవసరమైన భూ పత్రాలను పొందలేకపోతున్నారు. భూ వివరాలను గతంలో ఇంటి వద్దే తెలుసుకునే వెసులుబాటు ఉండేది. ఫోన్లలో కానీ, కంప్యూటర్లలో కానీ క్షణాల్లో అవసరమైన భూమి వివరాలను తెలుసుకునేవారు. రైతులు తమకు అవసరం వచ్చినప్పుడల్లా 1బీ, అడంగల్, ఎఫ్ఎంబీలను తీసుకునేవారు.

రైతులను దోచుకుంటున్న మీసేవ, ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులు

మీభూమి పోర్టల్ సరిగా పనిచేయకపోవడంతో రైతులు 1బి, అడంగళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితులలో 1బి, అడంగళ్లు కావాల్సిన రైతులు మీసేవ, ఇంటర్నెట్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన మీసేవ, ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులు రైతులకు 1బి, అడంగళ్లను ఇచ్చేందుకు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు.

పాత పద్ధతే అమలు చేయాలి



అసలే భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి. అంతే కానీ రైతులపై కక్ష సాధింపునకు పాల్పడే విధంగా కొత్త నిర్ణయాలు అమలు చేయడం సబబు కాదు. మీ భూమి పోర్టల్‌లో తెచ్చిన మార్పులపై క్షేత్రస్థాయిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అవసరమైన భూపత్రాలు సకాలంలో పొందలేకపోతున్నారు. పాత పద్ధతిలోనే మీ భూమి పోర్టల్ కొనసాగించాలి.

– వేణుగోపాల్‌రెడ్డి, రైతు, రావులకొలను

నెట్‌వర్క్ ప్రాబ్లంవల్ల అలా అవుతోంది



రాష్ట్ర ప్రభుత్వం మీ భూమి పోర్టల్‌ను అప్‌డేట్ చేసింది. మీ భూమి పోర్టల్‌లో రైతు తన భూమి వివరాలను తెలుసుకోవాలంటే ముందుగా మొబైల్ నంబర్‌తో పాటు ఓటీపీ ఎంటర్ చేస్తే రైతుకు రావాల్సిన భూమి వివరాలు తెలుస్తాయి. ప్రభుత్వమే మీ భూమి పోర్టల్‌ను అప్‌డేట్ చేయడంతో రోజుకు కొన్నిసార్లు మాత్రమే ఓటీపీని ఎంటర్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. పోర్టల్ మార్పు చేయడంతో నెట్‌వర్క్ సమస్య ఉందే తప్ప మీ భూమి పోర్టల్ మొరాయించడం జరగదు.

– సాయినాథరెడ్డి, తహసీల్దార్, సింహాద్రిపురం

చీనీకి తెగులు.. రైతుకు దిగులు



ట్రాక్టర్‌తో చీనీచెట్లను పెకలిస్తున్న రైతు

సింహాద్రిపురం : మండలంలోని నంద్యాలంపల్లెకు చెందిన చీనీ రైతు విశ్వనాథరెడ్డి బుధవారం కన్నబిడ్డల్లా పెంచుకున్న చీనీ చెట్లను కూకటి వేళ్లతో పీకివేశారు. తెలుగు రాష్ట్రాలలో చీనీ సాగు, ఎగుమతులలో మండలం మొదటి స్థానంలో ఉంది. ఈ ఏడాది చీనీ కాయల ధరలు పతనం కావడంతో రైతులు చీని సాగుపై ఆశలు సన్నగిల్లాయి. నంద్యాలంపల్లెకు చెందిన చీనీ రైతు విశ్వనాథరెడ్డి తెగుళ్లతో దిక్కుతోచక కన్నబిడ్డల్లా పెంచుకున్న చీనీచెట్లను ట్రాక్టర్‌తో పీకివేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్టపోయిన చీనీ రైతులను గుర్తించి నష్టపరిహారం అందేటట్లు చూడాలన్నారు.

విద్యుత్ మీటర్ ధరలపై రెట్టింపు బాదుడు



ధరలు రెట్టింపైన విద్యుత్ మీటరు

ముద్దనూరు : కొత్త విద్యుత్ మీటరు ధరలను కూటమి సర్కార్ రెట్టింపు చేసింది. దీంతో గృహ అవసరాలకు, దుకాణాలకు కొత్తగా విద్యుత్ మీటరు ఏర్పాటు చేసుకునే పేద, మధ్య తరగతి ప్రజలను ప్రభుత్వం షాక్‌కు గురిచేసింది. గతంలో గృహ అవసరాలకు(కేటగిరి–1) విద్యుత్ మీటరు ఇంటికి బిగించుకోవాలంటే 1 కిలో వాట్‌కు సుమారు రూ.1800లు చెల్లించాల్సివుండేది. ప్రస్తుతం ఈ మీటరు ధర రూ.4200లు పెంచేశారు. ఇదే కేటగిరి(గృహ అవసరాలకు)లో 2 కిలో వాట్లకు గతంలో సుమారు రూ.3500ల వరకు చెల్లించేవారు. ప్రస్తుతం ఈ ధర రూ.6400 వరకు పెంచేసింది ప్రభుత్వం. అదేవిధంగా దుకాణాలకు (కేటగిరి–2)విద్యుత్ మీటరుకు గతంలో 1 కిలో వాట్‌కు 2850లు చెల్లించి విద్యుత్ మీటరు పొందేవారు. ప్రస్తుతం ఈ ధర రూ.5110లకు పెంచేశారు. ఇదే కేటగిరిలో 2 కిలో వాట్లకు ప్రస్తుతం ధర రెట్టింపుచేసి రూ.7వేలు వసూలు చేస్తున్నారు.గృహ, దుకాణాల అవసరాల ప్రాముఖ్యంలో సాధారణంగా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే కావడం గమనార్హం. కొత్తగా ఇళ్ళు నిర్మించుకున్నవారు, నూతనంగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారికి కూటమి సర్కార్ విద్యుత్ బిల్లుల్లోనేగాకుండా మీటర్ల కొనుగోలులో కూడా ఆర్థికభారంవేసింది. ఇప్పటికే ఈ రెట్టింపుధరలు అమలులో వుండటంతో పేదలపై అదనపు భారం పడుతోంది.

జగన్మాత.. కరుణచూపవమ్మ

పులివెందుల టౌన్ : దేవీ శరన్నరాత్రి మహోత్సవాలలో భాగంగా మూడవ రోజు బుధవారం పట్టణంలోని అమ్మవారిశాలలోని శ్రీవాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారు అర్ధనారీశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే అంకాలమ్మ ఆలయంలో అమ్మవారు మీనాక్షి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవేంకటరమణుడి ఆలయంలో వేంకటరమణుడు నరసింహస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ అలంకారాలలో ఉన్న అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించారు. అనంతరం ఆలయాల అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



పులివెందుల : అర్ధనారీశ్వర అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి



కమలాపురంలో శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి దేవి



జమ్మలమడుగు : గజలక్ష్మీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరిదేవి

డ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న హరిబాబు, నాగేళ్ల సాంబశివారెడ్డి

పులివెందుల : స్థానిక వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొని వివిధ సమస్యలపై ప్రజలనుంచి వినతిపత్రాలను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అందులో భాగంగా జయహో రథ సారథి డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేళ్ల సాంబశివారెడ్డితో కలిసి ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా హరిబాబు డ్రైవర్ల సమస్యలపై ఎంపీకి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడు డ్రైవర్లకు పలు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ హామీని అమలు చేయలేదని ఎంపీ దృష్టికి తెచ్చారు. దీనికి ఎంపీ డ్రైవర్ల తరపున ప్రభుత్వంపై పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆదినారాయణరెడ్డిని పరామర్శించిన ఎంపీ

చక్రాయపేట మండలం చిలేకాంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆదినారాయణరెడ్డిని టీడీపీ గుండాలు ఈనెల 15వ తేదీన చక్రాయపేట బైపాస్‌లో దాడి చేసి గాయపరిచారు. ఈ నేపథ్యంలో బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం జరిగిన సంఘటన విషయాలను అడిగి తెలుసుకుని తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అదే గ్రామంలో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు పీఎం మావిరెడ్డి, సి.పి.రఘునాథరెడ్డిల స్వగృహాలకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చక్రాయపేట మండల జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ మాధవి బాలకృష్ణ, మండల ఉపాధ్యక్షులు గఫూర్, వేదమూర్తి, జేసీఎస్ కన్వీనర్ లోమడ రామాంజనేయరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రాంబాబు, సర్పంచ్‌లు కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మల్లిరెడ్డి, మాజీ సర్పంచ్ చెన్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహులు, హర్షిద్, గంగయ్య, శీను, ఉత్తయ్య, మోహన్‌రెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25టన్నుల జిప్సం మంజూరు



చిన్నచెప్పలి ఆర్ఎస్‌కేకు వచ్చిన జిప్సంను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : మండలంలోని చిన్నచెప్పలి ఆర్ఎస్‌కేకు 25 టన్నుల జిప్సం మంజూరైందని ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం చిన్నచెప్పలి ఆర్ఎస్‌కే వచ్చిన జిప్సంను ఆమె పరిశీలించారు. చిన్నచెప్పలితో పాటు ఎర్రగుడిపాడు, కమలాపురం–2, దేవరాజుపల్లె ఆర్ఎస్‌కులలో ఇప్పటికే జిప్సం అందుబాటులో ఉందన్నారు. జిప్సం పూర్తి ధర రూ.255 ఉండగా రూ.75 సబ్సిడీ పోను రూ.180 చెల్లించి రైతులు జిప్సం తీసుకోవచ్చునన్నారు. కోగటం, సంబటూరు, కమలాపురం, ఎర్రగుడిపాడు, జంభాపురం, నల్లింగాయపల్లె, చిన్నచెప్పలి ఆర్ఎస్‌కేలలో డీఏపీ ఎరువులు ఉన్నాయని వాటి ధర రూ.1350 అని ఏఓ తెలిపారు. కావలసిన రైతులు ఆర్ఎస్‌కే సిబ్బందిని సంప్రదించి తీసుకోవాలని ఆమె తెలిపారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : రైతులకు అవసరమైన జిప్సం అందుబాటులోవుందని, జిప్సం బస్తా ధర రాయితీ పోనూ రూ.178.35, ఒక్కో రైతుకు 1 హెక్టారుకు 4 బస్తాలు అందజేయనున్నట్లు డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు రామ్మోహన్‌రెడ్డి, ఏవో వెంకటకృష్ణారెడ్డిలు తెలిపారు. బుధవారం వారు కొర్రపాడులో పొలంపిలుస్తోంది కార్యక్మరంలో పాల్గొన్నారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని, రైతులకు అవసరమైన 20:20:0:13కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో వున్నాయన్నారు.

అమ్మవారికి వెండి కిరీటం, కవచాలు వితరణ



దాత రామసుబ్బారెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకుంటున్న అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

వల్లూరు : దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ గంగమ్మ దేవతకు కమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ చవ్వారెడ్డి రామసుబ్బారెడ్డి దంపతులు వెండి కిరీటం, వెండి ఖడ్గం, డమరుకం, శూలం, కవచాలను వితరణగా ఇచ్చారు. వారు ఏపీఎస్ఆర్‌టీసీ మాజీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డితో కలిసి బుధవారం అమ్మవారిని సందర్శించుకుని అర్చకులకు వాటిని అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. అనంతరం గ్రామంలోని శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయాన్ని వారు దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అబ్బిరెడ్డి శంకర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ కమలాపురం టౌన్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, వైసీపీ నేతలు రామసిద్దారెడ్డి, సుబ్బారెడ్డి, నాగసుబ్బారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో టీఎస్‌పీకెఎస్ బీఎంఎస్ యూనియన్‌ల ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడవ రోజు చేరాయి. కార్మికులు చేస్తున్న దీక్షలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

సింహాద్రిపురం : స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ సాయినాథరెడ్డి, డీటీ హరిబాబులు ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రతి లబ్ధిదారునికి కుటుంబ సభ్యుల వివరాలు సహా పూర్తిస్థాయిలో కార్డులు ఇవ్వడం జరిగిందని, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది నిర్ధారణతో, బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా కార్డుల పంపిణీ పూర్తయిందన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ పుష్పరాజు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంగీకార్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్, హౌసింగ్, మెప్మా సిబ్బంది

పులివెందుల రూరల్ : స్థానిక మెప్మా కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ రాముడు హౌసింగ్, మెప్మా అధికారులతో కలిసి అంగీకార్–2025 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగీకార్ అనేది ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఉద్దేశించిన కార్యక్రమమన్నారు. ఇళ్లు లేని ప్రతి పేదవారికి ఇళ్లు నిర్మించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈ హౌసింగ్ రామసూరెడ్డి, సీఎల్‌టీసీ రామచంద్రారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

అర్చి ప్రారంభం



సింహాద్రిపురం : స్థానిక నిడివెల్ల ఆంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం ఆలయ ముఖ ద్వార అర్చిని ఆలయ ధర్మకర్త సాకం లక్ష్మీనారాయణరెడ్డి టెంకాయ కొట్టి ప్రారంభించారు. రూ.5లక్షలతో 23 అడుగుల ఎత్తు, 50 అడుగుల వెడల్పు, 3 అడుగుల పొడవుతో ముఖద్వారం వద్ద అర్చిని నిర్మించారు. దీంతో ఆలయ ప్రాంతం వద్ద నూతన శోభ సంతరించుకుంది. ఆలయ కమిటీ సభ్యులు, సాకం కమలనాథరెడ్డి కుటుంబ సభ్యులు, మీడియా ఇన్‌చార్జి బాలకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో ముందుకు సాగాలి

పులివెందుల టౌన్ : విద్యార్థులు సేవాభావంతో ముందుకు సాగాలని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పరిశుభ్రత పాటిస్తూ ఇతరులకు సహాయం చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణురాలు రాక

– అందుబాటులో ప్లాస్టిక్ సర్జరీ సేవలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ శుక్రవారం ఉదయం 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలవరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు సలిపిరి, తల్లి (అమ్మవారు), సబ్యం(శోభి), మాగురు(మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పెను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్ఠు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ఉదయం 9.45 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రముఖ ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణురాలు డాక్టర్ దీప్తి బత్తు ఉదయం 10.30గంటల నుండి మధ్యాహ్నం వరకు కాస్మెటిక్ సర్జరి, హ్యాండ్ సర్జరి, మైక్రో వ్యాక్యులర్ సర్జరి, ట్రామా రీకంస్ట్రక్షన్, బర్న్ సర్జరి, డయాబెటిక్ ఫూట్ సర్జరి, క్రానియో ఫేషియల్ సర్జరి, అన్యో రీకంస్ట్రటివ్ సర్జరి సేవలు అందిస్తారన్నారు. కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ వరలక్ష్మి ఈనెల 27వ తేదీ శనివారం సాయంత్రం 6గంటల నుండి రాత్రి 8గంటల వరకు ఓపీలో అందుబాటులో ఉంటారన్నారు.

ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మహిళల చైతన్యమే దేశ సమగ్రాభివృద్ధి



మాట్లాడుతున్న వైవీయూ జర్నలిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ సురేష్

వేంపల్లె : మహిళలు చైతన్యవంతులైతేనే దేశం సమగ్రాభివృద్ధి చెందుతుందని వైవీయూ జర్నలిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ సురేష్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఎం ఉష పథకంలో భాగంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ మానవుల నుంచి ఉద్యోగస్తుల వరకు సమాచార చట్టాన్ని వినియోగించుకోవచ్చునన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర మాట్లాడుతూ కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ కలిపి ప్రధానమంత్రి ఉచ్చతర శిక్ష అభియాన్ పథకం కింద వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ పథకం ద్వారా కళాశాలకు దాదాపు రూ.10కోట్లు మంజూరు చేయడంతో పాటు కళాశాలలోని మౌలిక వసతులకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పీఎం ఉష పథకం కో ఆర్డినేటర్ కొండా సతీష్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బాలకొండ గంగాధర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానంతో ఆరోగ్యానికి ఎంతో మేలు



రక్తదానం చేస్తున్న విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అసోసియేట్ డీన్, తదితరులు

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని కళాశాల అసోసియేట్ డీన్ ఎం.మాధవ తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని కళాశాల అసోసియట్ డీన్ ప్రారంభించి మాట్లాడారు. రక్తాన్ని దానం చేయడం ద్వారా, అవసరంలో ఉన్న ఎంతోమందికి మీరు జీవితాన్ని ఇవ్వవచ్చునన్నారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులతో ఆయన అభినందించారు.

కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ శివరామిరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి మెడికలాఫీసర్ భార్గవ, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.